

రోడ్డెక్కనున్న షీ-ఆటోలు

- పీఎం అజయ్‌తో మహిళలకు ఉపాధి
- పది మండలాల నుంచి 28 మంది ఎంపిక
- ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధిపై డీఆర్‌డీఏ దృష్టి
- గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా కార్యక్రమం
- రూ.3 లక్షలు వడ్డీలేని రుణం.. రూ.50 వేలు సబ్సిడీ

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా.. ఆర్థికంగా శక్తివంతులను చేయడమే ధ్యేయంగా.. జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రవాణా రంగంలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు నూతన ప్రణాళికల అమలుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి ఇచ్చేందుకు డీఆర్‌డీఏ షీ-ఆటోలను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో ప్రయోగాత్మకంగా గుంటూరు జిల్లాలో షీ-ఆటోలను ప్రవేశపెట్టేందుకు డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం అనుకున్న లక్ష్యాలను సాధిస్తే మిగిలిన జిల్లాల్లో కూడా షీ-ఆటోలను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు డీఆర్‌డీఏ తరపున బ్యాంకులతో మాట్లాడి రుణాలు మంజూరు చేయిస్తారు. ఒక్కొక్క మహిళకు రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తారు. అందులో రూ.50 వేల వరకు సబ్సిడీ కింద మినహాయింపు ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు నెలవారీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద సుమారు 82 మంది మహిళలకు ఆటోలు ఇప్పించేందుకు డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేసింది. ఇందులో మొదట విడతగా 28 మంది మహిళలను ఎంపిక చేశారు. అందులో పది మండలాలకు ప్రాధాన్యం ఇచ్చారు. చేబ్రోలు-3, దుగ్గిరాల-2, గుంటూరు-7, కొల్లిపర-1, మేడికొండూరు-2, పెదనందిపాడు-6, ఫిరంగిపురం-2, తెనాలి-1, తుళ్లూరు-1, వట్టిచెరుకూరు-3 చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు.

డ్రైవింగ్ నైపుణ్యం కలిగిన వారే ఎంపిక..

గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన షీ-ఆటో లబ్ధిదారుల ఎంపికలో డీఆర్‌డీఏ అధికారులు ప్రధానంగా చదువుతో పాటు డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఆటో తీసుకుని పూర్తిగా దానిపై ఆధారపడి ఆర్థికాభివృద్ధి సాధిస్తామన్న భరోసా, నమ్మకం కలిగిన వారిని మాత్రమే మొదటి విడతలో ప్రాధాన్యం ఇచ్చారు. లబ్ధిదారులు ఎంచుకున్న రవాణా రంగం వారికెంత మేరకు ప్రయోజనకరంగా ఉంటుందన్న విషయాన్ని కూడా ఆయా గ్రామాలకు వెళ్లిన డీఆర్‌డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఆటోలకు స్థానికంగా ఉన్న అవసరాలను కూడా అంచనా వేశారు.

స్థితిగతుల్లో మార్పు...



మహిళలు తలుచుకుంటే చేయలేని పనిలేదు. రవాణా రంగంలో వారి ప్రాధాన్యం పెంచడం సంతోషం. పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా ఇప్పించే ఆటోలు వారి జీవన స్థితిగతులను సంపూర్ణంగా మార్చుతాయి. వారి ఆర్థికాభివృద్ధి ఆటోలా పరుగులు పెడుతుంది. మూస పోసిన పద్ధతిలో కాకుండా వినూత్నంగా ఆలోచించే ఎస్సీ మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తరపున అన్ని విధాలా అండగా ఉంటాం.

-టీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ, గుంటూరు

- రూ.70 కోట్ల మంజూరులో అవకతవకలు
- నకిలీ పాసు పుస్తకాలతో దారిమళ్లించినట్లు ఆరోపణ
- బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి ప్లెడ్జి రుణాలు
- నల్లపాడు జీడీసీసీ బ్యాంకు అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- 17 కోల్డ్‌స్టోరేజ్‌లకు జారీ చేసిన లోన్లను పరిశీలించాలని ఆదేశాలు





రుణాలు గోల్‌మాల్

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అనే వ్యక్తి పేరుతో గుంటూరు సమీపంలోని నల్లపాడు జీడీసీసీ బ్రాంచ్‌లో రూ.10 లక్షలు రుణం ఇచ్చినట్లు రికార్డులో ఉంది. ఆ రుణం సంగతి తనకు తెలియదని బాధితుడు చెప్తున్నాడు. దీంతో నల్లపాడు బ్రాంచ్‌లో 2022-23 మధ్య కాలంలో జరిగిన అక్రమ రుణ మేళా వెలుగు చూసింది. ఒకే కోల్డ్ స్టోరేజ్‌కి సుమారు రూ.53 కోట్ల వరకు రుణాలు ఇవ్వడం, అక్కడ సరైన మిర్చి నిల్వలు లేకపోవడం వంటి వాటిని అప్పట్లో విచారణకు వెళ్లిన అధికారులు గుర్తించారు. ఈ మేరకు నల్లపాడు జీడీసీసీ అక్రమాలపై ప్రాథమిక విచారణ నిర్వహించిన జిల్లా సహకార అధికారి వీరాచారి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో మరింత లోతైన విచారణ జరిపించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సహకార కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో తెనాలి డివిజనల్ సహకార అధికారి కేవీ రామారావును విచారణ అధికారిగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రారంభమైన విచారణ..

ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో నల్లపాడు జీడీసీసీ(గుంటూరు జిల్లా కేంద్ర సహకార) బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. బ్యాంకుకు సంబంధించిన సమాచారం, విచారణకు అవసరమైన రికార్డులను సహకార శాఖ అధికారులు కేవీ రామారావుకు అందజేశారు. బ్యాంకు పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు మంజూరు చేసిన రుణాలు భారీస్థాయిలో పక్కదారి పట్టిన నేపథ్యంలో ఈ విచారణ జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో జీడీసీసీలో కీలకపాత్ర పోషించిన వ్యక్తులు నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి రుణాలను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు పరిధిలో సుమారు రూ.70 కోట్ల వరకు ప్లెడ్జి రుణాల కింద మంజూరు కాగా చాలా వరకు బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలున్నాయి. వినుకొండ ప్రాంతంలో క్యాటరింగ్ చేసుకునే వ్యక్తులకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు అక్రమార్కులైన నేతలకు సహాయ పడ్డారన్న విమర్శలున్నాయి.

అన్నింటిపై విచారణ..

నల్లపాడు బ్రాంచి పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్ లకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. వాటిపై కూడా విచారణ జరగనుంది. ప్లెడ్జి రుణాలతో పాటు, మిగిలిన రుణాలపై కూడా దర్యాప్తు చేపట్టనున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో జరిగిన మొత్తం లావాదేవీలు, రుణాలు పంపిణీ, రికవరీ తదితరాలపై విచారణ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది.

అన్ని చోట్ల అదే పరిస్థితి

కోల్డ్‌స్టోరేజ్‌ల పేరుతో జీడీసీసీలో భారీగా ప్లెడ్జి రుణాలు పొందారు. వాస్తవానికి అక్కడ ఏ విధమైన మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు ఇచ్చేశారు. కొన్ని సందర్భాల్లో రుణం ఇచ్చేటప్పుడు మిర్చి ఉన్నట్లుగా చూపించినా ఆ తర్వాత దానిని వేరే వ్యక్తులకు అమ్మేశారు. ఇటువంటి వ్యవహారంలో కొందరు అధికారులు పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. చాలా సందర్భాల్లో అసలు రైతుకు తెలియకుండానే రుణం ఇచ్చేశారని సమాచారం. ఇలా అక్రమాలు పెద్దఎత్తున జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. ఇవికాక ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రుణాల పేరుతో బ్యాంకు నిధులను దారిమళ్లించారని తెలిసింది. ఇతర రుణాల్లోనూ అక్రమాలు జరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఇంటిని కోల్పోయాం.. పరిహారం అందించండి

- 53వ రోజు ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు వినతుల వెల్లువ

4

ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ కీలక భూమిక

- అభ్యుదయ రైతులకు పురస్కారాల ప్రదానోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు

డీఆర్ఎం విధుల్లో చేరడంపై అనిశ్చితి

6

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు వ్యాఖ్యలపై దుమారం

- ఏం తమాషాలు చేస్తున్నారంటూ కమిషనర్, ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు
- ఏకవచనంతో దూషించడంపై కమిషనర్ బాయ్‌కాట్



6

అవకాశాలు అందిపుచ్చుకుంటేనే భవిష్యత్

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో కలెక్టర్

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అవకాశాలు అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్ విద్యార్థుల సొంతమని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద విద్యార్థులను ఐఐటీయన్లుగా తీర్చిదిద్దేందుకు ఐఐటీ మద్రాస్ సహకారంతో జిల్లాలోని నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో విద్యాశక్తి పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, కిట్స్ అందిస్తున్నామన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు లోకేశ్ శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డీఈవో రేణుక, ప్రిన్సిపాల్ సునీత, వృత్తి విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆనందబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ జ్యోత్స్నకుమారి, కార్పొరేటర్ పోతురాజు సమత, ఎంఈవో ఖుద్దూస్, తహసీల్దారు నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో తదితరులు విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే నసీర్

నేడు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు

గుంటూరులో ఎన్టీఆర్ స్టేడియం, తెనాలి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాట్లు

గుంటూరు(విద్య), తెనాలి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో గుంటూరు, తెనాలిలో ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగ నున్నాయి. గుంటూరులో ఎన్టీఆర్ స్టేడియంలో, తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పోటీల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభ మయ్యే పోటీలకు పెద్దసంఖ్యలో యువతులు, మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాష న్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో గుంటూ రులో టీడీపీ సీనియర్ నాయకులు కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ అంగలకుదురులో పోటీలకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. పోటీలకు హాజ రయ్యే వారి కోసం నిర్వా హకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీల్లో మహిళలు, యువతులే పాల్గొనా లని, చుక్కల ముగ్గులు మా త్రమే వేయాల్సి ఉంటుం దని నిర్వాహకులు తెలిపారు. అవసర మైన ముగ్గులు, రంగులు, ఇతర సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాల న్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలను నిర్వాహకులు ఎక్కడికక్కడ అందజేస్తారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి అందించనున్నారు.



గుంటూరు : ముగ్గుల పోటీల కోసం ఎన్టీఆర్‌స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లు



తెనాలి : శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల బ్యానర్

ప్రభావతిపై.. ఎవరి ప్రభావం?

- రఘురామ కేసులో వెలుగుచూసిన కొత్త కోణం
- ఐపీఎస్ శ్రీలక్ష్మి తరహాలో ఊబిలో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్
- గత ప్రభుత్వంలో ఓ ఎంపీ అండతోనే ఆమెకు కీలక పోస్టింగ్
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ఆ ఎంపీని వెంటాడుతున్న గతం

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుని హత్య చేసేందుకు పన్నిన కుట్ర కేసులో నిందితురాలిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ప్రభావతి ఉదంతంలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ప్రభావతి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితురాలు కావడంలో కీలకపాత్ర పోషించిన నాటి వైసీపీ ఎంపీ, ఇప్పటి కూటమి ఎంపీపై కొత్త చర్చకు తెరలేచింది. రఘురామకృష్ణరాజును హింసించాలన్న ఆలోచన నాటి ముఖ్యమంత్రి జగన్‌ది కాగా అందుకు అయన చుట్టూ ఉన్న నేతలు సహాయ పడ్డారన్న ఆరోపణలున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రభావతిని కూడా అప్పట్లో కీలకంగా ఉన్న ఎంపీ ప్రభావితం చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రభావతి భర్త రవికి సదరు ఎంపీకి మధ్య మంచి స్నేహం ఉండడంతో తగిన అర్హతలు లేనప్పటికీ ఆమెను జీజీహెచ్‌లో అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. ఆమెను సూపరింటెండెంట్‌ను చేసేందుకు అర్హతలు ఉన్న నిపుణులైన డాక్టర్లను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఈ కృతజ్ఞతతోనే ప్రభావతి, రఘురామకృష్ణరాజు కేసులో తీవ్రమైన అన్యాయానికి ఒడిగట్టినట్లు ప్రచారం జరుగుతోంది. 2020లో ఆమె జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించి 2023లో ఉద్యోగ విరమణ పొందారు. ఆ మధ్య కాలంలోనే రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ ఉదంతం జరిగింది.

ఎంపీ అండతో చెలరేగిన వైనం..

జగన్‌కు అప్పట్లో సన్నిహితంగా ఉండే ఎంపీ అండ దండలు ఉన్నాయన్న ఆలోచనతో ప్రభావతి చాలా సందర్భాల్లో ఇతర పార్టీల నేతలను పూచికపుల్లతో సమానంగా చూశారన్న ఆరోపణలున్నాయి. రఘురామ దేహంపై తీవ్రమైన గాయాలు ఉన్నా ఏమి కాలేదని నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఆమె మాత్రమే కాకుండా గుండె వైద్య నిపుణులపై కూడా నివేదిక మార్చేలా ఒత్తిడి తెచ్చినట్లు తేలింది. చెప్పినట్లు చేయకపోతే బాగుండదు.. ప్రభుత్వ పెద్దల నుంచి ఇబ్బందులు వస్తాయని ప్రభావతి తోటి వైద్యులతో అన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇదే వ్యవహారంలో రఘురామకృష్ణరాజు లాయర్ పోసాని వెంకటేశ్వర్లు చేసిన వాదనలు కూడా వారు గుర్తు చేస్తున్నారు. సీఐడీ కస్టడీలో ఉన్న రఘురామ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య నివేదిక ఇవ్వాలని కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ప్రభావతి ఒత్తిడి తీసుకురావడంలో ఎంపీ పాత్రే కీలకమైనదనే వాదన తెరపైకి వచ్చింది.

మరో శ్రీలక్ష్మి..

రాజకీయ నాయకుల అండదండలతో కీలకమైన పోస్టులోకి వస్తున్న అధికారులు ఎక్కడో ఒక చోట ఇరుక్కుంటూనే ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి అదే రీతిలో కేసుల్లో ఇరుక్కోగా ఇప్పుడు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తప్పులో కాలేశారు. ఉద్యోగ విరమణ పొంది ప్రశాంతంగా జీవిస్తున్న సమయంలో ఆమె చుట్టూ ఉచ్చు బిగిసింది.

నివేదిక తప్పుల తడక..

ప్రభావతి నేతృత్వంలో మాజీ ఎంపీ వ్యవహారంలో ఇచ్చిన రిపోర్టు పూర్తి స్థాయిలో తప్పుల తడకతో కూడిందని నిర్ధారణైంది. పోలీసులు కొట్టిన దెబ్బలకు నరాలు చిట్లి అంతర్గతంగా రక్తస్రావం జరిగినట్లు కూడా గుర్తించారని రఘురామ లాయర్ కోర్టుకు వివరించారు. రఘురామను కస్టడీలో చిత్రహింసలకు గురిచేసినట్లు సుప్రీంకోర్టు సైతం ప్రాథమికంగా నిర్ధారించిందంటే ప్రభావతి బృందం ఎంత ధైర్యంతో వాస్తవ నివేదికను తారుమారు చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన మునివేళ్లకు గాయాలు ఉన్నట్లు విజయవాడలోని మెడికల్ బోర్డు నిర్ధారిస్తే ప్రభావతికి అవేవీ కనిపించలేదు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన సీఐడీ అధికారులను కాపాడేందుకు ప్రభావతి శతవిధాలా ప్రయత్నించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించండి

● మంత్రి అనగాని సత్యప్రసాద్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల టీడీపీ కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టభద్రులు, వైద్యులు, న్యాయవాదులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పాఠశాలల యాజమాన్యంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రౌడీలకు ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టి ఆ పదవికే కళంకం తెచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా చదువుకునే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగస్తులను అన్ని విధాలా వేధించింది జగన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. ఆయన హయాంలో ఉన్న ఎమ్మెల్సీలు రౌడీమూకలేనని, అనంతబాబును హత్యచేసి కారులో శవాన్ని డోర్ డెలివరీ చేసినా జగన్‌రెడ్డి కనీసం స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంత అభివృద్ధి కోసం తనవంతు కృషి చేశానని, వేమూరు, తెనాలి శాసనసభ్యునిగా, విద్యాశాఖ మంత్రిగా పని చేశానని, ఉద్యోగస్తుల కష్టనష్టాలు తనకుతెలుసునన్నారు. వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు డైరెక్టర్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు మణిక్యారావు, కొల్లూరు ఎంపీపీ కనగాల మధుసూదన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్వాన్ గోగినేని కనకయ్య సేవలు మరువలేనివి


కనకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్వాన్ గోగినేని కనకయ్య విద్యారంగానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గోగినేని కనకయ్య 108 జయంతి వేడుకలను స్థానిక ఎస్‌వీవీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక విద్యా సంస్థలను నెలకొల్పిన విద్యా ప్రదాత గోగినేని కనకయ్య అని అన్నారు. గ్రామీణ ప్రాంతమైన తాడికొండలో అనేక విద్యాసంస్థలను స్థాపించి ఎంతో మందికి చదువుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. తొలుత కనకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు, ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, చారులత, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య, తహసీల్దార్ కె.నానరయ్య, త్రిపురనేని మల్లేశ్వరరావు, డాక్టర్ కుర్ర అమల, సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నీటి సంఘం అధ్యక్షుడు జి.మధుసూదనరావు, ఎడ్డూరి ప్రసన్నకుమార్, మన్నె రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు ఏవీవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఎన్.రమణయ్య, చంద్రశేఖర్, ఎం.రవి పాల్గొన్నారు.

ఇంటిని కోల్పోయాం.. పరిహారం అందించండి

● పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ
● 53వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ



వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన ఒరవడి సృష్టిస్తూ మంత్రి లోకేశ్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. శనివారం ప్రజాదర్బార్ 53వ రోజుకు చేరుకోగా మంగళగిరి నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ వర్గాల ప్రజల నుంచి లోకేశ్‌కు అనేక విజ్ఞప్తులు వచ్చాయి. వారి సమస్యలు సావధానంగా విన్న లోకేశ్ పరిష్కరిస్తానని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పలు సమస్యల పరిష్కారం కోసం సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల ఆవేదన...

వంశధార ప్రాజెక్టు కింద కోల్పోయిన తన ఇంటికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కొల్లివలస గ్రామానికి చెందిన భవిరి సింహాచలం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కింద ఇల్లు కోల్పోవడంతో ఆధారం లేక భార్య, నలుగురు పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పరిహారం అందించాలని, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసినా అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. టిడ్కో ఇంటి కోసం నగదు చెల్లించినప్పటికీ అలాట్ అయిన ఇంటిని మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విజయవాడ రాజరాజేశ్వరి పేటకు చెందిన షేక్ రేష్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పసుపు కుంకుమ కింద తనకు సంక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు పట్టాదార్ పాస్‌పుస్తకం మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా మిట్టపాలెంకు చెందిన కొమ్మినేని చిన్న వెంకటరమణమ్మ విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో ఎనిమిదేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రకాశం జిల్లా తూర్పు వెంకటాపురంకు చెందిన జంపాల రామరావు లోకేశ్‌కు అర్జీ అందించారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. గ్రామ శివారులోని ఆర్ అండ్ బీ బ్రిడ్జిని కూడా విస్తరించాలని కోరారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాసులురెడ్డి తన 28 అంకణాల స్థలాన్ని కబ్జా చేశారని, విచారించి న్యాయం చేయాలని పున్నూరు రాఘవయ్య లోకేశ్‌ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. 1994లో ఎంఆర్‌వో కార్యాలయం ఎదురు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేశానని, తన స్థలం పక్కనే సుబ్బారాయుడు స్థలం ఉందనీ, అతడు అతని స్థలంతోపాటు నా స్థలాన్ని కూడా శ్రీనివాసులు రెడ్డికి విక్రయించాడని, దౌర్జన్యంగా ప్రహరీ గోడ కట్టారని పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేదని వాపోయారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ చెప్పారు. పెన్షన్ అందించడంతోపాటు తమ సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు పలువురు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందించగా పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేంద్రీయ జలశక్తి సభ్యులు


సాగర్ ప్రాజెక్ట్ పరిశీలనలో కేంద్రీయ జలశక్తి సభ్యులు

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టును శనివారం కేంద్రీయ జలశక్తి సభ్యులు పరిశీలించారు. నాగార్జున సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీ, వాక్‌వే, స్పిల్‌వే, జలవిద్యుత్ కేంద్రంను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రీయ జలశక్తి సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ డ్యాం రీహాబిటేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్ట్‌ను పరిశీలించి శనివారం ఇక్కడకు వచ్చామన్నారు. ప్రాజెక్ట్ పటిష్ఠ కోసం అమలు చేయాల్సిన పనులను పరిశీలించి నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కృష్ణా జలాల వినియోగంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న విభేదాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ డ్యాం పటిష్టతకు ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలో రూ.160 కోట్లతో ప్రతిపాదనలు పంపారన్నారు. తమ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ పరిశీలనలో కేంద్రీయ జలశక్తి జాయింట్ కమిషనర్ మనోజ్‌కుమార్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు డీఈ అజయ్‌యాదవ్, జేఈ రాజేష్, ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీధర్‌రావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈలు శ్రీనివాస్, మురళీధర్, ఏఈలు సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండానే..

● మిర్చియార్డులో కొందరు అధికారులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు
● తాము ఫిబ్రవరి నెలలో బదిలీపై వచ్చామని ఆవేదన
● అక్రమాలు జరిగిందంతా అంతకుముందని నివేదన

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక అందరిని విస్మయానికి గురి చేస్తుంది. కలెక్షన్ కింగ్‌లను వదిలేసి ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి నెల ముందు బదిలీపై వచ్చి విధుల్లో చేరిన వారిపై చర్యలకు సిఫార్సు చేయడానికి కారణాలు ఏమిటో వారికే తెలియాలని మార్కెటింగ్ వర్గాలు వాపోతున్నాయి. మొత్తం 20 మందిపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. వారిలో ఏడు, ఎనిమిది మంది సూపర్‌వైజర్లపై తగిన అభియోగాలను నమోదు చేయలేదు. సిఫార్సుల్లో మాత్రం యాక్షన్ తీసుకోవాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో తమ విజ్ఞప్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులకు ఆయా సూపర్‌వైజర్లు నివేదించారు.

నివేదికలో కొరవడిన స్పష్టత

మిర్చియార్డులో లైసెన్సుల రెన్యువల్స్, ప్రొప్రయిటర్ల పేర్ల మార్పులో రూ. కోట్లు చేతులు మారాయన్నది ప్రధాన అభియోగం. దీనిపై అప్పటి చైర్మన్ ఎం. సుధాకర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. అలానే అప్పటి సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి పైనా డిపార్టుమెంటల్ యాక్షన్ తీసుకోవాలని సూచించింది. ఈనామ్‌లో అక్రమాలు 2019 జూన్ నెల నుంచి జరుగుతూ వచ్చాయి. అయితే అప్పటి నుంచి ఈ ఏడాది మిర్చి సీజన్ వరకు ఎవరెవరు అక్రమాలకు పాల్పడ్డారనే దానిపై నివేదికలో స్పష్టత కొరవడింది. యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ చేసిన ఫిర్యాదులో కొంతమంది అధికారుల పేర్లను ప్రస్తావించారు. అయితే విజిలెన్స్ నివేదికలో వారి పేర్లు గల్లంతయ్యాయి.

రూ. కోట్లు పోగేసుకొన్న వారిని వదిలి..

ఎవరైతే ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు బదిలీపై వచ్చారో వారిపై యాక్షన్ తీసుకోవాలని సిఫార్సు చేసి అంతకుముందు పెద్దఎత్తున జీరో, కటింగ్ బిజినెస్‌లను విస్మరించి రూ. కోట్లు పోగేసుకొన్న వారిని వదిలి పెట్టడంపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో వారి పాత్రని విజిలెన్స్ పసిగట్టలేక పోయిందా... యార్డులో సమాచారం ఇచ్చిన సిబ్బంది మాయ చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేయడం, కొందరి పేర్లు గల్లంతు కావడం, నివేదికలో స్పష్టత లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చేసుకొని మార్కెటింగ్ శాఖ తీసుకోబోయే చర్యలపై యార్డువర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. నివేదిక ఆధారంగా మార్కెటింగ్ శాఖ ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 568.60 అడుగులు ఉంది. ఇది 253.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,484 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 49,859 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ కీలక భూమిక

● ఖర్చు తగ్గించి దిగుబడులు పెరిగేలా రైతుల్లో చైతన్యం తేవాలి
● వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
● విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు


ఆదర్శ రైతు దంపతుల్ని సత్కరిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, డాక్టర్ లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని, డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడం వలన వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని, పంటలో ఎక్కడైతే చీడపురుగులు ఉన్నాయో అక్కడే డ్రోన్ టెక్నాలజీతో మందులు పిచికారి చేయవచ్చని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా "అభ్యుదయ రైతుల పురస్కారాల పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభ్యుదయ రైతు దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అచ్చెనాయుడు మాట్లాడుతూ డ్రోన్స్‌ను ఒకప్పుడు పెళ్లిళ్ల వంటి కార్యక్రమాల్లో ఉపయోగించే వారనీ, కానీ ప్రస్తుతం వ్యవసాయంలో వీటి వినియోగం విరివిగా ఉందన్నారు. పంటకు పట్టిన తెగులును రైతు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో శాటిలైట్, క్లౌడ్ టెక్నాలజీ వినియోగించి భూసార పరీక్షలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ రసాయన ఎరువులను వినియోగించి సాగు చేయడం వలన అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని దేశంలోని అందరూ ఒకేసారి కాకుండా, మెల్లమెల్లగా విస్తీర్ణాన్ని పెంచుకుంటుపోవాలని హితవు పలికారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిస్తూ ఆదర్శ రైతులను సన్మానించడంతో పాటు వారి ఆలోచనల్ని తెలుసుకునేందుకు ఇది మంచి కార్యక్రమం అన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ నూతన వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతలపై ఫౌండేషన్ తరుపున రైతులకు శిక్షణ ఇస్తామని తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిథులను, రైతు దంపతులను ఘనంగా సన్మానించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన దర్శి శేషారావు ప్రకృతి అభ్యుదయ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ జన్మదిన వేడుకలు


జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది అభిమానుల మధ్య ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 48వ జన్మదిన వేడుకలు శనివారం క్రోసూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 48 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ కట్ చేశారు. మత పెద్దలు ఆయన్ను ఆశీర్వదించారు. వివిధ దేవాలయాల నుంచి వచ్చిన పూజారులు వేద ఆశీర్వచనం పలికి ఆయా దేవాలయాల దేవుళ్ల, అమ్మవార్ల చిత్రపటాలను ఎమ్మెల్యేకు బహూకరించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఎర్రబాలెం నుంచి సభా ప్రాంగణం, మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లో అభిమానులు గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ర్యాలీలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన వేలాది మంది అభిమానులు పాల్గొన్నారు. అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎమ్మెల్యేకు పూల బొకేలు అందజేసి శాలువాలు, పూల దండలు వేసి ఘనంగా సత్కరించారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వందలాది మంది టీడీపీ అభిమానులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్మదిన వేడుకల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు నివేదికలు సమర్పించినట్టు తెలిపారు. నియోజకవర్గానికి మరొక మోడల్ స్కూల్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. జన్మదిన వేడుకలను నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. క్రోసూరు మండలానికి చెందిన నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోక వెంకటరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ధూళ్ల సాంబశివరావు, దుద్దుల యోహాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు ఏపూరి నాగేశ్వరరావు, కాంద్రు కాశయ్య, పార్టీ నాయకులు నలజాల సదాశివరావు, గుడిపాడు బాషా, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు ఉన్నారు. పార్టీ పెదకూరపాడు మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, అమరావతి మండలానికి చెందిన పంచాయతీ రాజ్ చాంబర్ జాతీయ ఉపాధ్యక్షుడు జాష్టి వీరాంజనేయులు, పార్టీ అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, బెల్లంకొండ మండలానికి చెందిన మస్తాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

టైపింగ్‌లో హరితకు ప్రథమ ర్యాంకు



వేమూరు, మంగళగిరి జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన ఆరాధ్యుల హరితసాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు 2024లో నిర్వహించిన తెలుగు టైప్ లోయర్ గ్రేడ్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును సాధించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో తమ బంధువుల వద్ద ఉండి మంగళగిరిలోని మాధవి టైపు ఇనిస్టిట్యూట్ ద్వారా తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షకు హాజరైంది. 200 మార్కులకు గానూ 196 మార్కులను సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హరితసాయికి మాధవి టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు పి.మురళీధర్, సహచర విద్యార్థులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113.121.132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

అంధులకు అక్షర లోకాన్ని చూపించిన లూయిస్ బ్రెయిలీ

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి
● ఘనంగా లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు



బ్రెయిలీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

గుంటూరు(విద్య),జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధులకు అక్షర లోకాన్ని చూపించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. శనివారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, మొహమ్మద్ నసీర్ ప్రాంగణంలోని లూయి బ్రెయిలీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏటా జనవరి 4వ తేదీన ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం జరుపుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యేలు తెలిపారు. కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, మానం పద్మశ్రీ, కసుకుర్తి హనుమంతరావు, కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్నామాస్టారు పాల్గొన్నారు.

కౌలు రైతులు పంట రుణాలు తీసుకోవాలి

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కౌలు రైతులు పంట రుణాలు తీసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.మహిపాల్‌రెడ్డి శనివారం విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులు (సీసీఆర్‌సీ కార్డు ఉన్న వారు) సమీపంలోని బ్యాంకుల దగ్గరకు వెళ్లి పంట రుణాలను పొందాలని అన్నారు. రైతులు రుణాలను పొందే క్రమంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే 0863-2232953 నెంబర్‌కి ఫోన్ చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి సూచించారు.

శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతి నగర్, శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా శ్రీ శృంగేరి శ్రీ విరూపాక్ష శ్రీ పీఠాధిపతులు గంబీర్ ఆనంద భారతి స్వామి హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు హాజరై శ్రీమద్రామాయణ పారాయణం చేశారు. అనంతరం రామాయణంలోని 24 వేల శ్లోకాల అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీరామ సేవాసమితి నిర్వాహకుడు సోమయాజులు, పాలకమండలి సభ్యుడు కొరపాటి రామారావు పాల్గొని రుత్వికరణం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 4(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యల పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ కోరారు. ఈ మేరకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యా సంవత్సరానికి సంబంధించి వేతనాలు, మెస్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేడా హనుమంతురావు, జంగాల చైతన్య, యశ్వంత్, ప్రణీత్ పాల్గొన్నారు.

ఇంగ్లీష్ మీడియం విద్యతోనే పేదరికం కనుమరుగు

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేవలం సంపన్నులు మాత్రమే కాకుండా సామాన్యులు సైతం ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసిస్తేనే పేద ప్రజల జీవితాల్లో సమూల మార్పులు సాధ్యమని స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. ఏటి అగ్రహారంలోని ఎస్‌కెబిఎమ్ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇంగ్లీష్ డిక్షనరీలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గురవయ్య, పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, బందా రవీంద్రనాథ్, బత్తుల దేవానంద్, వెలుగూరి రత్నప్రసాద్, రఘురామిరెడ్డి, నూరసాని వెంకటరెడ్డి, కొత్తపేట సతీష్, సోమి కమల్, గంగాధర్‌రెడ్డి, వనజాక్షి, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, బెంజమిన్, నీలి, మనోజ్, రత్నకుమారి, రమణి, దుర్గ, ఆలా కిరణ్, దాసు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్తల సదస్సులో పాల్గొన్న దేగల ప్రభాకర్

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటిస్తున్న మెరుగైన ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో నూతన పెట్టుబడులు పెట్టాలని ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. హైదరాబాదులో జరుగుతున్న ఆప్తా ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్తల సదస్సు లో ఆయన పాల్గొన్నారు. సదస్సులో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించి, పలు రాష్ట్రాలు, 25 దేశాలకు చెందిన కం పెనీల ప్రతినిధులతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదా రులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి నిరు ద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో ట్రాఫిక్‌ను పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రాఫిక్ నిర్వహణ పర్యవేక్షణలో భాగంగా శనివారం రాత్రి ఎస్పీ సతీష్‌కుమార్ నగరంలో పర్యటించారు. ప్రభుత్వ మహిళా కాలేజి కూడలి, శంకర్ విలాస్ కూడలి తదితర ప్రాంతాల్లో పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సిఐలు అశోక్ కుమార్, సింగయ్యకు సూచనలు చేసారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

మద్యం బాటిళ్ళు ధ్వంసం చేసిన రైల్వే పోలీసులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గడచిన ఐదేళ్ళలో గుంటూరు రైల్వే పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ళను శనివారం ధ్వంసం చేసారు. 2020 నుంచి 2024 సంవత్సరం వరకు 48 ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన 2680 బాటిళ్ళకు సంబందించి ఐదు లక్షల ఖరీదైన 830 లీటర్ల అక్రమ మద్యంను న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలో గల డంప్ యార్డు వద్ద ధ్వంసం చేసారు. రైల్వే డీఎస్పీ పి అక్కేశ్వరరావు, రైల్వే సబ్ డివిజన్ ఈడీఈ మరయ్యబాబు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ అంజి బాబు, రైల్వే సీఐ వీర బాబు, రైల్వే ఎస్సైలు ఎం లక్ష్మీనారాయణరెడ్డి, పి రమేష్, సిబ్బంది, మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేసారు.

పీడీఎఫ్ విజయానికి కృషి చేయాలి

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, విద్యార్థి, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, కె.నళినీకాంత్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, జిల్లా సహ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వీవీకే సురేష్, బ్యాంకు ఎంప్లాయిస్ సంఘం నాయకులు ఎం.సాంబశివరావు, సీఐటీయూ గుంటూరు నగర, తూర్పు పశ్చిమ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, నేతలు - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

దొంగపత్రాలు సృష్టించి ఆస్తి కబ్జాకు యత్నం

● డైమండ్‌బాబు వ్యవహారంపై డీజీపీకి ఫిర్యాదు చేస్తా
● తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌కిరణ్



విలేకరుల సమావేశంలో ఆధారాలు చూపుతున్న విజయ్‌కిరణ్

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దొంగపత్రాలు సృష్టించి తన ఆస్తి కబ్జా చేయాలని వైసీపీ నగర అధ్యక్షుడు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) కుట్ర చేస్తున్నాడని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి యరమాల విజయ్‌కిరణ్ మండిపడ్డాడు. అరండల్‌పేటలోని ఓ హోటల్లో శని వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయిబాబారోడ్డు శాంతినగర్‌లోని తన స్థలాన్ని డైమండ్ బాబు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కొంతకాలంగా కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ఈ ఆస్తి వివాదంపై హైకోర్టుకు కూడా డైమండ్ బాబు వెళితే ఆధారాలు చూసి న్యాయస్థానం కూడా చీవాట్లు పెట్టిందన్నారు. ల్యాండ్ గ్రాబర్‌గా తయారైన డైమండ్‌బాబును పోలీసులు అరెస్టు చేయాలని, ఆయన వెనుకున్న యెండూరి వసంతపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. తన వద్దనున్న ఆధారాలతో సహా ఎస్పీకి, డీజీపీకి, హోం మంత్రికి కూడా ఫిర్యాదు చేస్తానని విజయ్‌కిరణ్ స్పష్టం చేశారు. కబ్జాకోరైన డైమండ్‌బాబుకు మాజీ మంత్రి అంబటి రాంబాబు, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నూరిఫాతిమాలు మద్దతుగా నిలవటం చూస్తుంటే అక్రమార్కులకు వైసీపీ అండగా నిలుస్తున్నట్లు ఉందన్నారు.

ఉద్యోగులు క్రిమినల్ కేసులో ఇరుక్కుంటే నో వర్క్, నో పే

● రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సివిల్, క్రిమినల్ కేసుల వల్ల సస్పెండ్ అయిన ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే విధానం గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయానికి బయట ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేటు క్రిమినల్, సివిల్ కేసుల్లో ఇరుక్కుని సస్పెండ్ అయి అటు తరువాత విధి నిర్వహణకు పునఃనియామకం పొందిన ఉద్యోగి సస్పెన్షన్ కాలాన్ని ఈ కింద తెలిపిన విధంగా క్రమబద్ధీకరించాలన్నారు. కార్యాలయానికి సంబంధం లేని వ్యక్తిగత కారణాల వల్ల సస్పెండ్ అయ్యాడు కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వానికి ఏ మాత్రం సబంధం లేదు కావున సస్పెన్షన్ కాలాన్ని నో వర్క్ , నో పే అనే సూత్రాన్ని అనుసరించి అతనికి ఎలాంటి జీత భత్యాలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒక వేళ అతను కోర్టు కేసుల్లో నిరపరాధి అని తేలినప్పటికీ అతనికి జీత భత్యాలు రావన్నారు. క్రమశిక్షణా చర్యలు పూర్తి చేసేందుకు సస్పెండ్ అయిన ఉద్యోగి తగిన రీతిలో సహకరించకపోతే అట్టి ఉద్యోగి సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీగా పరిగణించినా కూడా అతని జీతభత్యాలు పూర్తిగా కాకుండా కొంత మేరకు చెల్లించేందుకు అధికారి ఉత్తర్వుల్లో తెలియజేయాలన్నారు. సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగి శాఖాపరమైన లేక కోర్టు కేసుల విషయమై క్రమశిక్షణా చర్యలు పూర్తికాకముందే చనిపోయిన యెడల సస్పెండ్ అయిన తేదీ నుంచి చనిపోయిన తేదీ వరకు ఉన్న కాలాన్ని డ్యూటీగా అన్ని విషయాలకు పరిగణించాలన్నారు. అతని కుటుంబ సభ్యులకు అతను సస్పెండ్ కాకుండా ఉంటే వచ్చే జీతభత్యాలను చెల్లించాలని వీరయ్య తెలిపారు.

వైజ్ఞానిక దృక్పథం పెంపొందించడమే సైన్స్ ప్రదర్శనల లక్ష్యం

● జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో డీఈవో సీవీ రేణుక

గుంటూరు(విద్య),జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించి వారిలో పరిశోధనలపై ఆసక్తి పెంపొందించమే సైన్స్ ప్రదర్శనల లక్ష్యమని డీఈవో సీవీ రేణుక అన్నారు. పాతబస్టాండు సెంటర్‌లోని పరీక్షాభవన్‌లో జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన ప్రారంభం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 18 మండలాల నుంచి విద్యార్థుల గ్రూపు ప్రదర్శనలు, వ్యక్తిగత, టీచర్ ప్రదర్శనలు ఏర్పాటయ్యాయని వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎస్‌కే గౌసుల్‌మీరా, ఉర్దూడిఐ ఎస్‌కెఎండి ఖాసిం, ఎంఈవోలు ఖుద్దూస్, రమణయ్య, జ్యోతికిరణ్, శంకరాజు, పాఠశాల హెచ్‌ఎం వసుంధర, డీసీఈబీ కార్యదర్శి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పోటీల్లో విజేతలు వీరే.....

పోటీల్లో గ్రూపు విభాగంలో కె.గౌరినాథ్, ఎస్‌కె లతీఫ్(జడ్పీహెచ్ఎస్, రావెల), ఎండి అనీషాబేగం, ఎర్తీనా(ఎస్ఎస్ఎన్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు), అక్షయ, లిఖిత(జడ్పీహెచ్ఎస్, మేడికొండూరు) విద్యార్థులు తొలి మూడుస్థానాల్లో నిలిచారు. వ్యక్తిగత ప్రదర్శనల్లో ఎస్‌కె నజ్మా (జడ్పీహెచ్ఎస్, నారాకోడూరు), ఎస్ వపన్‌దుర్గా (జడ్పీహెచ్ఎస్, మూట్లూరు), ఎస్‌కె సనాఫిర్దోష్ (సికెజెఆర్ ఉన్నత పాఠశాల, మంగళగిరి) తదితరులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఉపాధ్యాయ ప్రదర్శనల్లో జి.శ్రీనివాసరావు(జడ్పీ హెచ్ఎస్, జీజీపాలెం), ఎన్.భాస్కరరావు (జడ్పీహెచ్ఎస్ సిరిపురం), కె రామారావు (జడ్పీహెచ్ఎస్, వట్టిచెరుకూరు) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. ఇంకా క్విజ్ పోటీల్లో ఎస్ఎంకెటి, ఎస్‌పికెం బాలకల ఉన్నత పాఠశాల గుంటూరు, జడ్పీహెచ్ఎస్, అత్తోట, జడ్పీహెచ్ఎస్ నారాకోడూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుచుకున్నారు. అదేవిధంగా బుక్‌ఫెయిర్‌లో కె.వెన్నెల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఎన్.సౌమ్యచంద్ర, జడ్పీహెచ్ఎస్, విజనంపాడు), ఎస్‌కె రుక్సానా (జడ్పీహెచ్ఎస్, కొప్పర్రు) తొలిమూడు స్థానాలు కైవసం చేసుకున్నారని డీఈవో పకటించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.



పోటీల్లో గెలుపొందిన విజేతలతో డీఈవో రేణుక తదితరులు

అనాథ ఆశ్రమాల్లో దుప్పట్లు పంపిణీ

గుంటూరు(తూర్పు), జనవరి 4(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని పలు వృద్ధ, అనాథ ఆశ్రమాల్లో దుప్పట్లు పంపిణీ, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మర్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు, మేనేజర్ చావా బోసు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు 'పశ్చిమ'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. 22వ డివిజన్ శ్రీనివాసరావుపేట, వేణుగోపాలపురం 20వ డివిజన్ నంబూరు సుభాని కాలనీలో మొత్తం రూ.47.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రెయిన్లు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో షేక్ రబ్బానీ, తన్నీరు కృష్ణ, షేక్ నాగూర్, షరీఫుద్దీన్, కొలసాని బాలకృష్ణ, ఆళ్ల హరి, ఆదం, అప్పిసెట్టి రంగా,రఫీ,ఇమ్రాన్, అహమ్మద్, కరిమూన్, వీరయ్య, వెంకట సాయి,రామారావు, ఎన్డీయే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొవిడ్ ఫైటర్స్ ట్రస్టుకు సహాయం అందిస్తాం: ఎమ్మెల్యేలు మాధవి, నసీర్



అంబులెన్సును ప్రారంభించిన ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్

గుంటూరు కొవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టుకు తమ సహాయ సహకారాలు అందిస్తామని గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. కొవిడ్ ఫైటర్స్ సంస్థ కొనుగోలు చేసిన అంబులెన్సును 35వ డివిజన్ పట్టాభిపురం షాదీఖానాలో శనివారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి ప్రారంభమైన సమయంలో దేశం మొత్తం చీకట్లోకి వెళ్లిపోయి, ప్రజలంతా భయపడిపోతున్న క్లిష్ట సమయంలో కొవిడ్ ఫైటర్స్ పేరుతో ముందుకు వచ్చి తమ మానవత్వాన్ని చాటుకున్న సంస్థ ప్రతినిధుల కృషి మరువలేనిదన్నారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, సుభాని, కొవిడ్ ఫైటర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



ఎమ్మెల్యే మాధవిని సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్లు రవీంద్రబాబు, రామ్మోహనరావు, శ్రీచైతన్య ఏజీఎం దుర్గాప్రసాద్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలపై విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన కల్పించాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. స్థానిక రింగురోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్‌లో శనివారం జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. ప్రాచీన సంస్కృతుల్ని విస్మరించరాదన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాలల ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, స్కూల్ డైరెక్టర్స్ మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఇన్‌చార్జులు సుబ్బారాయుడు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. బొమ్మల కొలువు, భోగిమంటల వేడుకలు, పొంగళ్ళు, కోలాటం, హరిదాసుల కీర్తనల నడుమ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

ల్యాబ్ నివేదికల్లో ఖచ్చితత్వం పాటించాలి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు జారీ చేసే ల్యాబ్ రిపోర్టుల్లో ఖచ్చితత్వం పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్లకు, మలే రియా సబ్ యూనిట్ అధికారులకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణనగర్‌లోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీజీపీ తిరుమలరావు


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న డీజీపీ, చిత్రంలో ఓపీ రమణ తదితరులు

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతిమధురం

● విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించిన డీజీపీ
● అణువణువూ పరిశీలించి ఆనందానుభూతి
● ప్రాథమిక విద్యే పునాది అంటూ విద్యార్థులకు సూచన

గుంటూరు సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తాను ఎంత పెద్ద అధికారి అయినా ఒకప్పుడు విద్యార్థినే అన్న విషయాన్ని డీజీపీ ద్వారకా తిరుమలరావు మర్చిపోలేదు. ఎంత ఎత్తుకు ఎదిగినా అలనాటి జ్ఞాపకాలు మనసు లోతుల్లో పదిలంగా ఉంటాయన్న వాస్తవాన్ని రుజువు చేశారు. తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన గుంటూరు కృష్ణనగర్‌లోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని అణువణువూ పరిశీలించి మధురానుభూతిని పొందారు. చిన్నతనంలో ఆడుకున్న ఆట స్థలం.. మధ్యాహ్నం చెట్టుకింద కూర్చుని భోజనం చేసిన ప్రదేశం.. స్నేహితులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన పాఠశాల ప్రాంగణం అంతా తిరిగిచూసి మరోసారి 1970 దశకంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న విద్యార్థులతో డీజీపీ తిరుమలరావు భావోద్వేగంతో మాట్లాడారు. 1970-74 మధ్యకాలంలో ఇదే పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివానని చెప్పారు. అప్పటి హెడ్మాస్టర్ సుబ్బారావు నేర్పిన క్రమశిక్షణ తమ ఎదుగుదలకు ఎంతో ఉపకరించిందన్నారు. తనతో పాటు ఇదే పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు డీజీపీలుగా, డాక్టర్లుగా, ప్రభుత్వ ఉన్నతోద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారని తెలిపారు. ప్రాథమిక విద్యే అన్నింటికీ పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు బాధ్యతతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియో వైద్యుడు ఓపీ రమణ మాట్లాడుతూ ఆనాటి జ్ఞాపకాలను మర్చిపోలేమని చెప్పారు. ఈ పాఠశాల తమకు ఎంతో చేసిందన్నారు. ఈ సందర్భంగా పెద్ద బాలశిక్ష, ఇతర పుస్తకాలు, వస్తువులను డీజీపీ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీం, రమణ, బషీర్, కరస్పాండెంట్ టీ శ్రీరామమూర్తి, సెక్రటరీ సమ్మోహిత్, మాజేటి గురవయ్య కాలేజ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎం విధుల్లో చేరడంపై అనిశ్చితి

● తొలుత ఆనంద్ మధుకర్ నియామకం
● ఆయన ఆసక్తి కనబరచకపోవడంతో లిలీ పాండేయకు పోస్టింగ్
● ఆమె కూడా సాంస్కృతిక శాఖలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న అధికారి


లిలీ పాండేయ

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ పోస్టింగ్‌పై ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అధికారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు. దక్షిణమధ్య రైల్వేలో చిన్న జోన్ అన్న ముద్ర గుంటూరుకు ఉండటమే ఇందుకు కారణమన్న అభిప్రాయం రైల్వేవర్గాల్లో వ్యక్తమౌతున్నది. ఒకసారి డీఆర్ఎంగా విధుల్లోకి చేరితే కనీసం రెండేళ్లపాటు ఇక్కడ కొనసాగాల్సిందే. దీంతో ఢిల్లీ లాంటి పెద్ద నగరాల్లో విధులు నిర్వహణకు అలవాటైన రైల్వే అధికారులు గుంటూరుకు రావడానికి విముఖత కనబరుస్తున్నారు. డివిజన్ ఏర్పడిన కొత్తలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి డీఆర్ఎంలు బదిలీపై వచ్చి విధులు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు అలాంటి వాతావరణమే తలెత్తింది.

ప్రస్తుత గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ రెండేళ్ల పదవీకాలం ముగియడంతో ఆయన్ని రైల్వేబోర్డు బదిలీ చేస్తూ ఆనంద్ మధుకర్‌ని నియమించింది. దీనికి సంబంధించి గత నెల 26వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఢిల్లీలో గత కొన్నేళ్లుగా డిప్యూటేషన్‌పై రైల్వేకు చెందిన సాంస్కృతిక శాఖలో కొనసాగుతున్నారు. అయితే ఆయన గుంటూరు డీఆర్ఎంగా వచ్చేందుకు విముఖత కనబరిచారు. పైస్థాయిలో సిఫార్సులు చేయించుకొని తన పోస్టింగ్ ఆర్డర్స్‌ని రద్దు చేయించుకొన్నారు. దాంతో రైల్వేబోర్డు గత నెల 30వ తేదీన మరో అధికారి లిలీ పాండేయని గుంటూరు డీఆర్ఎంగా నియమించింది. అయితే ఆమె కూడా కేంద్ర సాంస్కృతిక శాఖలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. ఇది జరిగి దాదాపుగా వారం గడుస్తున్నా ఇప్పటివరకు లిలీ పాండేయ జాయినింగ్‌పై రైల్వేలో ఎలాంటి సమాచారం లేదు. ఇదే సమయంలో ఆమె కూడా డిప్యూటేషన్‌పై సాంస్కృతిక శాఖలో కొనసాగుతున్నందున వస్తారో, లేదోనన్న సందేహాలను రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. గుంటూరు రైల్వే డివిజన్ చిన్నది ఏమి కాదు. కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణం జరగబోతున్నది. అమరావతి నూతన రైలు మార్గం, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టులను రైల్వే శాఖ మంజూరు చేసింది. నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గంతో డివిజన్ పరిధి కూడా పెరిగింది. డీఆర్ఎంకు ఇక్కడ సకల సదుపాయాలున్నాయి. అయినప్పటికీ ఉత్తరాదికి చెందిన అధికారులు చిన్నచూపు చూస్తుండటంపై డివిజనల్ రైల్వేవర్గాలు అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నాయి.


పురందేశ్వరికి సమతా కుంభ్ ఆహ్వానపత్రికను అందజేస్తున్న చినజీయర్ స్వామి

వేడుకగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

● హాజరైన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యదుకుల తిలకరత్న ట్రస్టు ఆధ్వర్యంలో మంగళగిరి బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. త్రిదండి చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు, అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తున్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ధనుర్మాస ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినజీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందుకున్నారు. శ్రీరామానుజాచార్యుల వారి 108 దివ్య దేశాల తృతీయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న సమతా కుంభ మేళా-2025 ఆహ్వాన పత్రికను చిన జీయర్ స్వామి, పురందేశ్వరికి అందజేశారు. కాగా, ధనుర్మాస ఉత్సవాల్లో 20వ రోజైన శనివారం 20వ పాశురాన్ని చినజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్, మంగళగిరి ప్రాంతాల నుంచి 300మంది భక్తులు గోదాదేవికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యదుకుల తిలకరత్న ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, ఉత్సవ నిర్వాహకులు, వేద పండితులు పాల్గొన్నారు.

హంపి విజయం తెలుగుజాతికి గర్వకారణం

● హంపిని అభినందించిన శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా చెస్ విజేత, తెలుగుతేజం కోనేరు హంపిని తాడేపల్లి మండలం కొలను కొండలోని ఆమె నివాసంలో ఏపీ స్పోర్ట్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 26 నుంచి 28 వరకు న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ రాపిడ్ ఉమెన్ చెస్ చాంపియన్ షిప్ 2024లో కోనేరు హంపి ప్రపంచ విజేతగా నిలవడంతో రవినాయుడు ఆమెను కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మహిళా చెస్ విజేతగా నిలిచి తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప జేశారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి యువతకు స్ఫూర్తి నివ్వాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ పాలసీని వివరించారు. క్రీడాభివృద్ధికి సూచనలివ్వాలని కోరగా ఆమె స్పందిస్తూ త్వరలోనే ఏపీ సీఎం చంద్రబాబును కలుస్తానని క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఆమెకు గన్నవరం ఎయిర్‌పోర్టులో శనివారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.


కోనేరు హంపిని అభినందిస్తున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి, కౌన్సిలర్లు

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు వ్యాఖ్యలపై దుమారం

● ఏం తమాషాలు చేస్తున్నారా అంటూ కమిషనర్, ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు
● ఏకవచనంతో దూషించడంపై కమిషనర్ బాయ్‌కాట్
● కేవలం ఏడు ప్రశ్నలపై మాత్రమే చర్చ
● కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటన

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. కమిషనర్ పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఉద్యోగులపై డైమండ్ బాబు మాట్లాడిన తీరును కమిషనర్ తీవ్రంగా ఎండగట్టారు. ఈ విధంగా మాట్లాడటం సభకు మర్యాద కాదంటూ డైమండ్ బాబు వ్యాఖ్యలపై కమిషనర్ తీవ్రంగా అసహనం వ్యక్తం చేసి సభలో మేయర్‌కు వివరంగా చెప్పి ఆయన బాయ్‌కాట్ చేస్తూ వెళ్లిపోయారు. ఆయనకు సంఘీబావంగా ఉద్యోగులందరూ కూడా కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అలాగే డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ కార్పొరేటర్‌లు కూడా కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కట్ చేసి వెళ్లిపోయారు. దీంతో నగర మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వైసీపీ కార్పొరేటర్‌లు కూడా వెళ్లిపోయారు.

దుమారం రేపిన డైమండ్ బాబు వ్యాఖ్యలు

కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలు సభలో సంచలనం కలిగించాయి. తన ప్రశ్నలు కాకపోయినప్పటికీ, అన్ని అంశాల్లో, విషయాల్లో, ప్రతి ప్రశ్నకు ఆయన జోక్యం చేసుకుంటూ మాట్లాడటం కౌన్సిల్లో పరిపాటిగా మారింది. ప్రతి కౌన్సిల్ లాగే ఈ కౌన్సిల్లో కూడా ఆయన వ్యాఖ్యలు అందర్నీ విస్తుబోయేలా చేశాయి. వాస్తవానికి వైసీపీ కార్పొరేటర్ షేక్ రోషన్ నగరపాలక సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ప్రశ్నలు వేశారు. ఆయన ప్రశ్నలకు కమిషనర్ పులి శ్రీనివాసులు సమాధానం చెబుతున్నారు. 'అసలు ఈ సమాధానం రాసిన వాడు ఎవడో పిలవండి.. వాడిని పిలవండి' అంటూ డైమండ్ బాబు వ్యాఖ్యలు చేశారు. కౌన్సిల్ ప్రారంభ దశలో కూడా ఆయన జీఎంసీ షాపుల లీజుల విషయంపై మాట్లాడుతూ అధికారులను తక్కువ భావంతో, చులకనగా మాట్లాడారు. ఇలా తరచూ మాట్లాడుతుండటంతో కమిషనర్ పులి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. 'నగరపాలక సంస్థ కౌన్సిల్‌కు సంబంధించి రూపొందించిన ఎజెండాలో ప్రతి అంశం మా కింది ఉద్యోగుల ద్వారా తెప్పించుకొని నేనే పూర్తి చేశాను. ఏదైనా ఉంటే నన్ను అడగండి. అన్నిటికీ నేనే బాధ్యత వహిస్తాను.' అంటూ కమిషనర్ వ్యాఖ్యానించారు. ఉద్యోగుల పట్ల అగౌరవంగా, అమర్యాదగా మాట్లాడొద్దు అంటూ కమిషనర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అయినా ఆగని డైమండ్ బాబు పదేపదే 'ఎవడు దీనిని తయారు చేసింది.. చెప్పండి అంటూ' మాట్లాడటంతో కమిషనర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. 'ఓ పక్క నేనేగా చెబుతుంది. అంతా నాదే బాధ్యత అని.. మీరు మళ్లీ అలా మాట్లాడితే ఎలా' అంటూ మండిపడ్డారు. ఈ విధంగా అయితే ఉద్యోగ బాధ్యతలు చేయలేమని, ఇలా మాట్లాడితే ఎంత బాధగా ఉంటుందో మీకు తెలుసా అంటూ మేయర్ ముందు తన బాధను విన్నవించి కమిషనర్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తూ బయటికి వెళ్లిపోయారు. ఆయనకు సంఘీభావంగా ఉద్యోగులంతా కమిషనర్‌తో పాటు వెళ్లిపోయారు. అప్పటి వరకు కౌన్సిల్ సమావేశంలో కేవలం ఏడు ప్రశ్నలు మాత్రమే చర్చించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

నగరపాలక సంస్థ కమిషనర్, ఉద్యోగులపై డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కమిషనర్ చాంబర్ నుంచి కౌన్సిల్ హాల్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. కౌన్సిల్ హాల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. డైమండ్ బాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. డౌన్ డౌన్ డైమండ్ బాబు అంటూ జీఎంసీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే ఆయన్ను డిప్యూటీ మేయర్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ బాయ్‌కాట్..

మధ్యాహ్నం కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన వెంటనే మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని కొనసాగించాలని ఆదేశించారు. అయితే ఎజెండా కాపీ చదివేందుకు కూడా ఉద్యోగుల అందుబాటులో లేరు. దీంతో వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల అభిప్రాయాలను తెలపాలని కోరారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ నుకవరపు బాలాజీ మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ఆ విధంగా మాట్లాడకూడదని, డైమండ్ బాబు వ్యాఖ్యలు సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామంటూ చెప్పగానే ఆయనకు సంఘీభావంగా టీడీపీ కార్పొరేటర్లు అందరూ వెళ్లిపోయారు. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ మనోహర్ నాయుడు ప్రకటించారు. కమిషనర్ వ్యవహరించిన తీరు సక్రమంగా లేదని వైసీపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాల్ బయట మీడియాతో నాయకులు మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కౌన్సిల్ ఘన నివాళులర్పించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, విభాగాధిపతులు పాల్గొన్నారు.

డైమండ్ బాబుపై చర్యలకు రంగం సిద్ధం

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబుపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తుంది. ఆయనపై అనర్హత వేటు వేసేందుకు పరిశీలన చేస్తున్నట్టు తెలిసింది.

డైమండ్ బాబు వ్యవహార శైలిని ఖండించిన రాష్ట్ర అసోసియేషన్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసీపీకి చెందిన డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది పట్ల అనుచితంగా, అమర్యాదగా మాట్లాడిన విధానాన్ని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) అధ్యక్షుడు సీహెచ్. నాగనరసింహరావు, ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, ఉపాధ్యక్షుడు చల్లా ఓబులేసు, భవాని ప్రసాద్, కోశాధికారి శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబును ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 679ను అనుసరించి డిప్యూటీ మేయర్ పదవి నుంచి, మున్సిపల్ కార్పొరేటర్ పదవి నుంచి తొలగించాలని, చట్ట ప్రకారం అతనిపై కఠినచర్యలు తీసుకొని, మున్సిపల్ కమిషనర్ల కు, అధికారులకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇలాంటి పరిణామాలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు

ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను సజావుగా నిర్వహించుకునే బాధ్యత అధికారుల దగ్గర నుంచి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరి మీద ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన పరిణామాల మీద ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం జరుగుతున్న ఈ సమావేశాల్లో ఇటువంటి పరిణామాలు ఏ మాత్రం ఆమోద యోగ్యంగా లేవని, ఇటువంటి ఘటనలను ప్రజలు ఎవరు హర్షించారని ఆమె పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వాలని, అదే సమయంలో సభను గౌరవంగా జరిపే బాధ్యత మేయర్, సభ్యుల మీద ఉందని అన్నారు. ఇప్పటికే నగరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ఇలా కౌన్సిల్ జరగకుండా చేయడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు.


సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

దేహదారుఢ్య పరీక్షల్లో 119మంది మహిళా అభ్యర్థుల ఎంపిక


పరుగుపోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు రెండో రోజు శనివారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో 226మందికి గాను 119మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. పరీక్షలకు 256 మంది హాజరయ్యారు. వారిలో 30మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 226మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించారు. వారిలో 15మంది బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 211 మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 123మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. వీరికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 11మంది అర్హత సాధించారు. 123మందికి లాంగ్‌జంప్ నిర్వహించగా వారిలో 119మంది అర్హత సాధించారు. మొత్తం 226మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 119 మంది తదుపరి రాత పరీక్షకు అర్హత సాధించారు. 107 మంది విఫలమయ్యారు. మహిళా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులకు, అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్స


మహలక్ష్మీతో డాక్టర్ రమణ, డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గొంతు మింగుడు పడక సరిగా ఆహారం తీసుకోలేక, నాలుగేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సతో ఉపశమనం కలిగించారు. వివరాల్లోకి వెడితే... మచిలీపట్నంకు చెందిన ఏ మహాలక్ష్మీ (45) నాలుగేళ్లుగా ఎకలేషియా కార్డియా టైప్-2 అనే సమస్యతో బాధపడుతోంది. దీని వల్ల ఆహారం మింగుడు పడకపోవడం, తిన్న ఆహారం గొంతులోనే ఉండిపోవడం, వాంతులవ్వడం, గుండె దగ్గర ఆగిపోవడం వంటి సమస్యలతో బాధపడుతుండేది.

ఏడాదిగా ఆమె మంచినీళ్లు కూడా సరిగా తాగలేకపోతోంది. ఇటీవల గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి చికిత్సకు వచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు అందే సమస్యను గుర్తించి డిసెంబరు 24న ఆమెకు ఆపరేషన్ చేశారు. ల్యాప్రోస్కోపిక్ హెల్లర్ కార్డియో మయాటమి విత్ డార్ ఫండప్లికేషన్ అనే పద్ధతిలో శస్త్రచికిత్స చేశారు. సర్జరీ విజయవంతం కావడంతో మహలక్ష్మి చక్కగా ఆహారం తీసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఈ ఆపరేషన్ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. అరుదైన ఆపరేషన్‌తో యువతికి ఆరోగ్యం సమకూర్చిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు.

సెంట్రింగ్ కార్మికుడి మృతి

చిలకలూరిపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గంగమ్మ గుడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్మెంట్ పై నుంచి కింద పడి సెంట్రింగ్ కార్మికుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావు పేటలోని వెంగళరెడ్డి కాలనీకి చెందిన శిరి వేరి కోటేశ్వరరావు(35) ఇక్కడి ఒక అపార్టుమెంట్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. మూత్ర విసర్జనకు లేచిన సందర్భంలో ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన అర్బన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేపు టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం

గుంటూరు (తూర్పు) జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రమౌళి నగర్ ,బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధ్యక్షతన సోమవారం ఉదయం 9 గంటలకు టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం జరుగుతుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు .సమావేశంలో కమిటీ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

నేడు సుందరకాండ యజ్ఞహోమ పూజలు

తెనాలి రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురులో ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి, దాస శేషస్వామి వార్ల పరంపరపీఠంలో ఆదివారం సుందరకాండ యజ్ఞ హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఉలిచి సీతా రామశర్మ (పట్టాభి) తెలిపారు. గుంటూరు కోటేశ్వరరావు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సుందరకాండ హోమ పూజలు జరుగుతాయన్నారు.

అధికారుల నిర్లక్ష్యం అభివృద్ధి పనులకు ఆటంకం

● తెనాలి పురపాలక సంఘం చైర్‌పర్సన్ రాధిక
● పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ బ్రహ్మేశ్వ రావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో జరగవలసిన అభివృద్ధి పనులకు అధికారుల నిర్లక్ష్యంతోనే ఆటంకాలు ఏర్పడ్డాయని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శనివారం స్థానిక గంగానమ్మ పేటలోని 35, 36వ వార్డులలో రెండవ రోజు కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను, సైడు కాలువల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం, సకాలంలో పనులకు టెండర్లను ఖరారు చేయకపోవడంతో 15వ ఆర్థిక సంఘ నిధులు ఆగిపోయాయని, పట్టణంలో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. మన నియోజకవర్గానికి ఇద్దరు మంత్రులు ఉన్నారని, వారైనా పురపాలక సంఘ అభివృద్ధికి నిధులు విడుదలలో చొరవచూపాలని, సుందర తెనాలికి సహకరించాలని ఆమె కోరారు. ప్రధానంగా రహదారుల వెంబడి సైడ్ డ్రెయిన్‌లను ఆక్రమించడంతో శానిటేషన్ పనులకు ఆటంకం ఎర్పడుతుందని, డ్రెయిన్‌ల ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. వార్డు ప్రజలు వ్యర్థాలను డ్రెయిన్‌లలో వేయవద్దని, ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు తాడిబోయిన బ్రహ్మేశ్వరావు, గొడవర్తి హరేరాం, టీపీవో సాంబశివరావు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నజీర్, ఏఈ జానీబాషా, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

లింగ నిర్ధారణ చట్ట నిబంధనలు ప్రదర్శించాలి

● సబ్ కలెక్టర్ సంజన సింహ ఆదేశం

తెనాలి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చట్ట నిబంధనలను ప్రదర్శించేలా చూడాలని సబ్ కలెక్టర్ సంజనా సిన్హా ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై సమీక్ష నిర్వహించారు. గర్భిణులు స్కానింగ్‌కు వచ్చిన సమయంలో శిశువుల లింగ నిర్ధారణ వెల్లడించకూడదనే అంశాలను ఆయా నోటీసులలో ఉదహరించాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఏమవుతుందో కూడా పొందుపరచాలని సూచించారు. మందుల దుకాణాలలో అబార్షన్ కోసం మందులను విక్రయించకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. వివాహ వయస్సుపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని, బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు పర్యవేక్షించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఎం డాక్టర్ అన్నపూర్ణ, శ్రీనివాసరావు, ప్రసాద్, రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, లక్ష్మీరేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టారీఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

తెనాలి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ టారీఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుందని ట్రాన్స్ కో ఈఈ చిరంజీవి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటైల్ సప్లయి టారీఫ్ మీద ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటుందన్నారు. కర్నూలులోని విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో వ్యక్తిగతంగానూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయం తీసుకుంటారని తెలిపారు. దీంతో పాటు తెనాలి డివిజన్ కార్యాలయంలోనూ మధ్యాహ్నం 2 గంటల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని తెలిపారు. వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలియజేయదలిస్తే ముందుగా తమ పేర్లను ఏపీఈఆర్‌టి సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యాలయంలోనూ స్వయంగా పేర్లు నమోదు చేసుకోవచ్చని వారికి తగిన సమయం కేటాయిస్తామని ట్రాన్స్ కో ఈఈ చిరంజీవి తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

తెనాలి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన యువతి అదృశ్యంపై టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆటోనగర్‌లో వ్యాపార సంస్థ నిర్వహిస్తున్న బాల శివకృష్ణ ప్రసాద్ కుమార్తె కళాశాలలో పిల్లలకు లంచ్ బాక్సు ఇచ్చి వస్తానని శుక్రవారం మధ్యాహ్నం వెళ్లింది. తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారిని గాలించి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బంగారు నగలు చోరీ

తెనాలి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తెనాలి నందులపేటకు చెందిన మహిళ యర్రా స్వాతి తెనాలి బస్‌స్టేషన్‌లో బస్సు కోసం వేచి ఉంది. కొంత సమయం గడిచాక బ్యాగ్ చూసుకుంటే బ్యాగ్ ఒక వైపు కత్తిరించి ఉంది. అందులో ఉన్న రూ.3 లక్షలు విలువైన బంగారు నగలు కనిపించలేదు. దీంతో ఆమె టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసునమోదు చేశారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

కొల్లిపర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్నవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు భూ సమస్యలు, పాస్‌బుక్ సమస్యలు, రీ సర్వే సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూమికి సంబంధించిన సమస్యలను రైతులు అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలపై 9 దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారణ చేసి త్వరలో పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఆర్‌ఐ కిశోర్, ఆలయ ఈవో పద్మావతి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 19 అర్జీలు

పొన్నూరుటౌన్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండమూడి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 19 అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. శనివారం కొండమూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మ్యూటేషన్ కోసం - 11 అర్జీలు, అడంగల్ మార్పు కోసం -2, పాస్‌పుస్తకాల కోసం -3, ఎఫ్‌లైన్ దరఖాస్తులు - 3 అందాయి. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం



చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు ప్రారంభించారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో కే. శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు సమక్షంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వడ్డించారు. అలాగే చేబ్రోలులో సూర్యదేవర నరసయ్య జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో రాయల సుబ్బారావు ప్రారంభించారు. 120 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను గుర్తించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధిహామీ పనులను గుర్తించి, కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆమె సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కూలీలందరికి ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా పంట కాల్వల మరమ్మతు పనులను గుర్తించాలని ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం నిమ్మ, దానిమ్మ, జామ, బత్తాయి, మామిడి, మునగ వంటి పంటలకు పూర్తి సబ్సిడీ ద్వారా అందజేస్తుందని, ఆసక్తిగల సాగుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఏపీవో రవి, టెక్నికల్ అసిస్టెంట్‌లు అజయ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.



పచ్చజండా ఊపి లారీలను సాగనంపుతున్న డీఎస్పీ జనార్దనరావు, శ్రీశైల భక్త సేవా సమితి సభ్యులు

శ్రీశైల భక్త సేవా సమితి
సేవలు అభినందనీయం

తెనాలి, మారీసుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భక్త సేవా సమితి సభ్యుల సేవా కార్యక్రమాలు అభినందనీయమని డీఎస్పీ జనార్ధనరావు కొనియాడారు. ఆదివారం గన్నవరం సమీపంలో విశ్వహిందూ పరిషత్ వారు నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభకు విచ్చేశేవారికి రెండు లారీలలో అల్పాహారం, స్వీట్లను శనివారం శ్రీశైల భక్తసేవా సమితి అధ్యక్షుడు ఆళ్ళ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో తరలించారు. డీఎస్పీ జనార్ధనరావు ఆయా లారీలకు పచ్చజండా ఊపి ప్రాంభించారు. కార్యక్రమంలో సభ్యులు బ్రహ్మానంద గుప్త, పూర్ణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు సరికాదు

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామారావు

చేబ్రోలు, జనవరి4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల తొలగింపుపై అధికారులు అవలంభిస్తున్న ఒంటెద్దు పోకడలు సమస్యను జఠిలం చేస్తున్నాయని, ఇది సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు ఆరోపించారు. చేబ్రోలు పంచాయతీ కార్మికులకు చేస్తున్న దీక్షలకు మద్దతుగా శనివారం సీపీఎం నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కరించవలసిన అధికారులు కార్మిక వర్గాన్ని భయబ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులను పోలీసులను ఉపయోగించి భయపెట్టడం సరికాదన్నారు. అనంతరం పంచాయితీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీ నారాయణ పంచాయితీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీను, సిహెచ్ హనుమంతరావు, ఎస్ రమేష్ బాబు, ఆదిశేషు, రామ్ బ్రహ్మదారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి వేడుకలు



చేబ్రోలు భవితా కేంద్రంలో బ్రెయిలీ జయంతి వేడుకలు..

చేబ్రోలు, జనవరి4 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు భవిత కేంద్రంలో శనివారం లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. భవితాకేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గలిగిన చిన్నారులకు సమక్షంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అందుల కోసం బ్రెయిలీ రూపొందించిన లిపి గురించి చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాయల సుబ్బారావు మాట్లాడుతూ అందుల కోసం ప్రత్యేకంగా ఆరు చుక్కల లిపిని బ్రెయిలీ రూపొందించారన్నారు. దృష్టి లోపం కలిగిన ప్రతి వ్యక్తి చదవటానికి, రాయటానికి ఈ లిపి ఉపయోగపడుతుందన్నారు. వరల్డ్ బ్రెయిలీ డే సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, భవిత కేంద్రం నిర్వాహకులు జి అనూరాధ, రాజేష్, సీఆర్పీ మల్లేశ్వరి పాల్గొన్నారు.

కొల్లిపర, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ప్రధానోపాధ్యాయుడు మృత్యుంజయరావు అన్నారు. కొల్లిపర భవిత కేంద్రంలో ఉపాధ్యాయురాలు శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మృత్యుంజయరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణా ఇవ్వడం వలన వారిలో నైపుణ్యాలు అభివృద్ధిపర్చవచ్చునన్నారు. పిల్లల్లో పెరుగుదల, బుద్ధి మాంద్యత లోపాలు ఉంటే వెంటనే వైద్య సలహా తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలుగల ఉపాధ్యాయులు సురేష్, పాపయ్య, సీఆర్పీ పిడపర్తి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను కాళ్ల దగ్గరపెట్టుకుని
వైసీపీ అధికారం అనుభవించింది

● మీడియా సమావేశంలో కూటమి ఎస్టీసెల్ నాయకులు

తెనాలి రూరల్, జనవరి 04(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలను కాళ్ల దగ్గర పెట్టుకుని అధికారం అనుభవించింది వైసీపీ నాయకులైతే వారికి సముచిత స్థానం కల్పించి అభ్యున్నతికి పాటుబడుతుంది కూటమి ప్రభుత్వమని తెనాలి నియోజకవర్గ ఎస్టీ సెల్ కూటమి నాయకులు అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఎస్సీ, ఎస్టీలకు కరెంట్ బిల్లు సబ్సిడీ తొలగించారంటూ ధర్నా చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితుడైన యువకుడిని అనంతబాబు హత్య చేయించి ఇసుకలో పూడ్చి పెడితే జోగి రమేష్ బాధితుడి తరుపున ఎందుకు ధర్నా చేయలేదని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీఎస్టీలకు ఉన్న పథకాలన్నీ నీరుగారుస్తుంటే వారి తరుపున నిలబడి ఎందుకు ప్రభుత్వాన్ని నిలదీయలేదో చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై జరిగినన్ని దాడులు కూటమి ప్రభుత్వంలో జరగడంలేదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల పాలనలో ఎస్సీఎస్టీల అభ్యున్నతికి ప్రణాళికతో ముందుకు నడుస్తుందన్నారు. రోజా కూడా ఇష్టానుసారం మాట్లాడితే ఊపేక్షించేదేలేదన్నారు. దళితుల పక్షపాతి నంటూ జోగి రమేష్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉంటే ఓ మాదిరి లేకుండా మరో మాదిరిగా మాట్లాడే తీరు ఇకనైనా మార్చుకోవాలని హితవుపలికారు. ఇకపై బురద జల్లె ప్రయత్నాలు మానుకోవాలని హితువు పలికారు. నియోజకవర్గ ఎస్టీసెల్ నాయకులు ముణావత్ నాగరాజునాయక్, రాజానాయక్, పోతురాజు, బాలనాయక్, భరత్‌నాయక్, శ్యామ్‌నాయక్, ఈశ్వర్ నాయక్, నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సదస్సులతో
రైతుల సమస్యలు పరిష్కారం

తెనాలి రూరల్, జనవరి 04(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకుని అదే గ్రామంలో పరిష్కరించేలా ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభల్లో భాగంగా శనివారం నేలపాడు సచివాలయంలో తహసీల్దార్ గోపాలకృష్ణ రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామంలోని రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. గ్రామంలో వివిధ సమస్యలతో 43 మంది రైతులు సభకు వచ్చి అందించారు. వాటిల్లో రెవెన్యూకి సంబంధించి 1 రాగా మిగిలినవి సర్వే కొరకు వచ్చినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. రైతులు తెలిపిన ప్రతి సమస్యను నిర్ణిత సమయంలో పరిష్కరించేలా కృషి చేస్తామని ఆయన హామి ఇచ్చారు. దేవాదాయ, ఇతర శాఖల అధికారలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే

తెనాలి, మారీసుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిచారు. శనివారం స్థానిక పాండురంగ పేట 27వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల కోసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ కౌన్సిలర్ బి అరుణ హాజరై చిన్నారుల అవగాహన కోసం ఏర్పాటు చేసిన కూరగాయ మినీ మార్కెట్‌ను తిలకించారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

31లోగా అభ్యంతరాలు తెలపాలి

తాడేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ భూసమీ కరణలో పాల్గొన్న తాడేపల్లి మండలం పెనుమాక రైతు లకు రిటన్‌బుల్ ప్లాట్లు ఇచ్చేందుకు స్థానిక సీఆర్‌డీఏ కార్యాలయంలో ముసాయిదా ప్రతిని అధికారులు నోటీసు బోర్డులో పొందుపరిచారు. స్థానికులు రైతుల కోసం ఈ ముసాయిదా ప్రతిని స్థానిక కార్యాలయంతోపాటు తుళ్ళూ రు సీఆర్‌డీఏ కాంపిటెంట్ అధారిటి కార్యాలయంలో కూడా నోటీసు బోర్డులో ఉంచారు. సదరు విషయమై ఎట్టి అభ్యంతరాలు ఉన్నా జనవరి 31లోపు రైతులు, సంబంధీ కులు తమ అభ్యంతరాలు తెలపాలని అధికారులు సదరు నోటీసులో కోరారు.

నేడు మాజీ సైనిక సంఘాల సమావేశం

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం మాజీ సైనిక సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం జరుగుతుందని మంగళగిరి ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కే గోవిందరావు తెలిపారు. రాష్ట్రంలోని మాజీ సైనిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని మాజీ సైనిక సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

మంగళగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో అక్రమంగా తొలగించిన పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎంటీఎంసీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన తెలియజేశారు. సుప్రీంకోర్టు నిబంధనలను సైతం ఉల్లంఘించి కార్మికులను విధుల నుంచి తొలగించడం సరికాదని, జనవరి ఒకటో తేదీ నుంచి పంచాయతీ కార్యదర్శి 12 మంది కార్మికులను అక్రమంగా తొలగించడం నిబంధనలకు విరుద్ధమని సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ పేర్కొన్నారు. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకుని, కార్మికులను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో యూనియన్ నేతలు పూర్ణచంద్రరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన పశు వైద్యశాల ప్రారంభం



ఆధునికీకరించిన పనులను ప్రారంభిస్తున్న డీజీఈ రాంప్రసాద్

మంగళగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన మంగళగిరి పశు వైద్యశాలను డీజీఈ డాక్టర్ రామ్‌ప్రసాద్, జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ నరసింహారావు ప్రారంభించారు. తొలుత వైద్యశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల వైద్యుడు పీవీ శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, ప్రతినిధులు అన్నే రత్నప్రభాకర్, అనిల్ చక్రవర్తి, వి.శ్రీనివాసరావు, అందె మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి స్వామి క్యాలెండర్ల ఆవిష్కరణ

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మిద్దె సెంటరుకు చెందిన శ్రీ భావనారుషి సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను తిరుపతిలోని టీటీడీ పరిపాలనా కార్యాలయంలో ఈవో జే.శ్యామలరావు ఆవిష్కరించారు. శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్లను వివిధ రూపాల్లో చిత్రీకరించి క్యాలెండర్లను రూపొందించిన సేవా సమితి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, హరికృష్ణ, సేవా సమితి ప్రతినిధులు గాజుల సత్యనారాయణ, అందె వెంకటేశ్వరరావు, గంజి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

2వ రోజుకు చేరుకున్న కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శనివారంతో 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను టి దుర్గాభవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత వేముల దుర్గారావు మాట్లాడుతూ ఇప్పటికే 171మంది ఏసీసీ కార్మికులు అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శారద, నవనీతం, లక్ష్మి, రమాదేవి, శివకుమారి, కే ఆదినారాయణ, కే స్టీవెన్, ప్రకాష్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరావాలి

● సమరసత సేవాఫౌండేషన్ జిల్లా కన్వీనర్ విజయ భాస్కరరావు

వట్టిచెరుకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హిందువులందరూ ఏకమయ్యే లక్ష్యంతో ఎన్‌టీఆర్ జిల్లా గన్నవరం కేసానుపల్లి గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి విశేష స్పందన లభిస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు తదితరులు భారీసంఖ్యలో తరలిరావాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ విజయ భాస్కరరావు పిలుపునిచ్చారు. హైందవ శంఖారావ సభలో సేవలందించేందుకు శనివారం మండలంలోని కారంపూడి నుంచి బయలు దేరిన బస్సును జిల్లా కన్వీనర్ విజయ భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. భారీ బహిరంగ సభకు తరలి వచ్చే వారి కోసం మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి 27 బస్సులను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహ కో-కన్వీనర్ ప్రసాదరెడ్డి, మండల కన్వీనర్ దాసరి శివన్నారాయణ, మహిళా కన్వీనర్, సహ కన్వీనర్ అమ్మమ్మ, పొన్నూరు ఖండ ధర్మ ప్రచారక్ శివయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే

మంగళగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రబాలెంలోని కోడ్ నెం.25, 26, 27, 28 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించి సంఖ్యాజ్ఞానం, సృజనాత్మకత వంటి అంశాలకు సంబంధించి చిన్నారుల నైపుణ్యాలను ప్రదర్శించారు.

టీడీపీ నేత తిరువీధుల బాపనయ్య మృతి



బాపనయ్య (ఫైల్)

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన టీడీపీ పద్మశా లి సాధికార సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ తిరువీధుల బాపనయ్య శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. బాపనయ్య మృతికి మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పార్టీ బలోపేతానికి బాపనయ్య విశేషంగా కృషి చేశారని పేర్కొంటూ ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, పట్టణ అధ్యక్షుడు మాధవరావు తదితరులు బాపనయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

విద్యార్థి దశ నుంచే రాజకీయ నాయకులుగా ఎదగాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మేడికొండూరు జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రాజకీయ నాయకులుగా ఎదగాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సూచించారు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం హర్షించ దగ్గ పరిణామమని అన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థినులకు వడ్డించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి. శివన్నారాయణ, సిరిపురం గ్రామ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు శ్రీకారం

తుళ్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు రాయపూడి మధ్యలో అర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రోడ్డు మరమ్మతులకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడా తట్టమట్టి వేసి రోడ్లు బాగుచేసింది లేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అన్ని చోట్ల రోడ్లు వేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, సీనియర్‌నేత బెల్లంకొండ నరసింహారావు, రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, ధనేకుల వెంకట సుబ్బారావు, టీడీపీ రాయపూడి గ్రామ అధ్యక్షుడు మూల్పూరి శ్రీనివాసరావు, మహిళా నేత గిరిజా, జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదునెలల్లోనే పలు అభివృద్ధి పనులకు మోక్షం

● కేఆర్‌కొండూరులో వాటర్‌ప్లాంట్ ప్రారంభం, బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన



వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, కేసంనేని శ్రీఅనిత, కొల్లూరు మల్లేశ్వరరావు

దుగ్గిరాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకై మంత్రి నారా లోకేశ్ సహకారంతో దివి ల్యాబ్స్ సౌజన్యంతో సురక్షిత మంచి నీటి పథకాన్ని ప్రారంభించామని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. కేఆర్‌కొండూరులో రూ.16లక్షలతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనితతో కలిసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే విద్య, ఐటీ, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేశ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, ఎన్నికల హామీలు నిలబెట్టుకుంటూ వస్తున్నారన్నారు. దుగ్గిరాల మెయిన్‌రోడ్డు పూర్తిచేశారని, ఒక టిన్నర దశాబ్దకాలంగా చేపట్టని తెనాలి- విజయవాడ మెయిన్‌రోడ్డు పనులను సైతం కొంతమేర పూర్తి చేశారన్నారు. మరో ఐదు ప్లాంట్‌లను దివి ల్యాబ్స్ వారు నెలకొల్పనున్నట్లు చెప్పారు. దివి ల్యాబ్స్‌కి చెందిన మురళి, కొల్లూరు శివనాగ మల్లేశ్వరరావు, పోసాని అప్పారావు, తాడిబోయిన రాంబాబు, నాగేశ్వరరావు, మొహిద్దీన్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన

చిలువూరు నుంచి కేఆర్ కొండూరు వరకు గుంతల మయమై పదేళ్లుగా నానా ఇబ్బందుల పడుతున్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నికల ప్రచార సమయంలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు రూ.175లక్షలతో తారురోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం శంకుస్థాపనలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ గ్రామాధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, కొల్లూరు మల్లేశ్వరరావు, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, శేషగిరిరావు, ఏసుపాదం, ఏఈ భాస్కరరావు, ఈవో శరత్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 226 అర్జీలు

కాకుమాను, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో జరిగిన రెవెన్యూ గ్రామసభలకు 226 అర్జీలు రైతుల నుంచి వచ్చినట్లు తహల్దార్ వెంకటస్వామి తెలిపారు. కాకుమాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామరెవెన్యూ సభ జరిగింది. భూ కొలతల కోసం 6 అర్జీలు, భూమి ఆన్‌లైన్‌లో నమోదు కోసం 9 అర్జీలు మొత్తంగా గ్రామంలో 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి వివరించారు. ఈ నెల 8తో గ్రామ సభలు ముగింపు ఉందని 7న కొల్లిమర్లలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ, వీఆర్వోలు, దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గోకుల క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో ఈ నెల 10, 11 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు గోకుల క్షేత్రం ప్రెసిడెంట్ వంశీధర దాస తెలిపారు. మంగళగిరి అక్షయపాత్ర కార్యాలయంలో శనివారం ఉత్సవాల తాలూకా గోడప్రతులను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారు ప్రత్యేక అలంకరణతో ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. స్వామి వారికి లక్షార్చన, ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం కల్యాణం జరుగుతుందన్నారు. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీమన్నారాయణ స్వయంగా నమ్మాళ్వార్‌ను వైకుంఠ ద్వారం నుంచి తీసుకువెళ్లారని, ఆ విశిష్టతను తెలియజేస్తూ ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోకుల క్షేత్రం ప్రతినిధులు విలాస దాస, రఘునందన్ దాస, వైకుంఠ నారాయణ దాస పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం.. అభినందనీయం

కాకుమాను, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయడం అభినందనీయమని ఎంఈవోలు కెన్నడీ, కేవీ భాస్కరరావు అన్నారు. శనివారం కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థుల ఆకలి తీర్చడమే కాకుండా రుచికరమై, ఆరోగ్యకరమైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. విద్యార్థులకు ఆరు రోజులు ఆరు రకాల మెనూతో విద్యార్థులకు భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమాక జూనియర్ కళాశాలలో ..

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథ కాన్ని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య ప్రారంభించారు.

స్కేటింగ్ విజేత హాశిష్‌కు మంత్రి అభినందనలు



స్కేటింగ్ విజేత హాశిష్‌ను అభినందిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని పొలాచిలో డిసెంబర్ 5 నుండి 15 వరకు జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో బంగారు పతకం సాధించిన తాడేపల్లి టౌన్ డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్‌ను మంత్రి లోకేశ్ అభినందించారు. శనివారం ఉండవల్లి ప్రజాదర్బార్‌లో హాశిష్ తల్లిదండ్రులు మెరుగుపాల రాజు, శివ మాధవి, హాశిష్‌ను లోకేశ్‌ను కలువగా లోకేశ్ హాశిష్‌ను అభినందించి భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

లోకేశ్‌ను కలిసిన టైలర్స్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఫిబ్రవరి 28వ తేదీన మంగళగిరిలో జరుగనున్న టైలర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగులు, ప్రధాన కార్యదర్శి జంజనం వెంకట సాంబ శివరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ అదృశ్యంపై కేసు నమోదు

ప్రత్తిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కు చేసిన మోటార్ సైకిల్ కనిపించకుండా పోవడంపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. చెరుకుపల్లి మండలం మోరవాగుపాలెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి రమణ కృష్ణారెడ్డి కళ్లం హరినాద్ కళాశాలలో పీడీ అసిస్టెంట్ పనిచేస్తూ కొంత కాలంగా ప్రత్తిపాడు మండలం యనమదలలో నివాసం ఉంటున్నాడు. అయితే శుక్రవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన తన పల్సర్ బైక్‌ను దొంగలు అపహరించుకు పోయారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుమామిళ్ళ మైనర్ కాలువకు మరమ్మతులు



కాలువను జేసీబీతో బాగు చేయిస్తున్న డీసీ చైర్మన్ నల్లజర్ల రవికుమార్ తదితరులు

ఫిరంగిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ మేజరు 39బీఎల్ మైనర్ కాలువను శనివారం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లజర్ల రవికుమార్ ఆధ్వర్యంలో బాగు చేశారు. చిరుమామిళ్ళ కాలువ బేతపూడి, వేమవరం, తాళ్ళూరు, కండ్రిక, నుదురుపాడు గ్రామాలకు నీరు అందుతుందని, ఐతే గత ప్రభుత్వ హయాంలో కాలువను పట్టించుకోక పోవటం వల్ల నాచు, గుర్రపుడెక్క అడ్డుపడి నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడటంతో ఐదు గ్రామాల రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని జేసీబీతో నాచు, గుర్రపు డెక్కను తొలగించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సుందరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మండవ నరసింహారావు, చెక్కా హనుమంతరావు, సర్పంచ్ నలజర్ల అప్పయ్య, సర్పంచ్ తడవర్తి కేశవరావు, రామ కోటయ్య, మందాల రామిరెడ్డి, కొండమూడి సాంబశివరావు తది తరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెను ప్రారంభించారు. నేతలు మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు గత రెండు నెలలుగా వేతనాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రాఘవులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.